ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 03.03.2026 **సమయం. 18.10 గంటలు**

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర చరిత్రలో ఈ రోజు అత్యధిక విద్యుత్ డిమాండ్ రికార్డ్ నమోదైంది. విద్యుత్ సంస్థలు ఎలాంటి అంతరాయం లేకుండా సమర్థవంతంగా సరఫరాను కొనసాగించడం పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను అభినందించారు.
2. సచివాలయంలో ఈ ఉదయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహిస్తున్న సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అంశాల పై దిశా నిర్దేశం చేస్తున్నారు.
3. మహిళా స్వయం సహాయక సభ్యులకు ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలు, ఆర్థికంగా రక్షణ కవచంగా నిలుస్తున్నాయని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు.
4. రాష్ట్రవ్యాప్తంగా ఈ రోజు హోళీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

.....

విద్యుత్ డిమాండ్

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఈరోజు విద్యుత్ డిమాండ్ లో కొత్త రికార్డు నమోదైంది. ఈరోజు ఉదయం పదకొండు గంటల ఒక్క నిమిషానికి 18వేల 139 మెగావాట్ల అత్యధిక డిమాండ్ నమోదుకాగా, విద్యుత్ సంస్థలు ఎటువంటి అంతరాయం లేకుండా సమర్థవంతంగా సరఫరాను కొనసాగించాయి. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ రంగ ఉద్యోగులకు, అధికారులకు అభినందనలు తెలిపారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి పెద్ద

రాష్ట్రాలతో సమానంగా నిలవడం తెలంగాణ సామర్థ్యానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఐటీ, ఔషధ, తయారీ, వ్యవసాయ రంగాల వేగవంతమైన వృద్ధే దీనికి ప్రధాన కారణమని అధికారులు తెలిపారు. రాబోయే వేసవి డిమాండ్‌కు కూడా అవసరమైన కరెంటు సరఫరాకు రాష్ట్రం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క తెలిపారు.

.....జీఎస్

కలెక్టర్ల సదస్సు

హైదరాబాద్ లోని సచివాలయంలో ఈరోజు అన్ని జిల్లాల కలెక్టర్ల సదస్సు జరుగుతోంది. ఉదయం మొదలైన ఈ కీలక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు.. పలువురు మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లబ్ధిదారుల అనుభవాలను గ్రామసభల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులను సమీపంలోని మెడికల్ కాలేజీలకు అనుసంధానం చేసి మెరుగైన వైద్యసేవలు అందించాలని, మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు సక్రమంగా చెల్లించాలని ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమంలో గ్రామ స్థాయి నుండి జిల్లా వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

.....జీఎస్

సీతక్క

మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలు ఆర్థికంగా రక్షణ కవచంలా నిలుస్తున్నాయని పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క తెలిపారు. గతంలో సంఘం సభ్యురాలు మరణిస్తే ఆమె

తీసుకున్న రుణభారం ఇతర సభ్యులపై పడేదని, దీంతో చాలా సంఘాలు బ్లాక్‌లిస్ట్ అయి, కొత్త రుణాలు మంజూరు కాక నిష్క్రియంగా మారేవని ఆమె గుర్తు చేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం రెండు కీలక పథకాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రమాద బీమా కింద ప్రమాద మరణం సంభవిస్తే పది లక్షల రూపాయల బీమా అందిస్తున్నారని, 2024 నుంచి ఇప్పటి వరకు 231 క్లెయిమ్ లను పరిష్కరించి, 23 కోట్ల రూపాయల పైచిలుకు కుటుంబ సభ్యులకు చెల్లించారని మంత్రి సీతక్క వివరించారు.

.....జీఎస్

పొంగులేటి

ఇటీవలి బదిలీల నేపథ్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్లకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ లోని సచివాలయంలో గద్వాల, కరీంనగర్, సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ సహా పలు జిల్లాల కలెక్టర్లు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదవారందరికీ చేరవేయడం కలెక్టర్ల బాధ్యత అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమతూకంగా ముందుకు తీసుకెళ్లాలని, ప్రజలతో మమేకమై మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు.

.....జీఎస్

వెల్ డన్ మహేష్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ను ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రత్యేకంగా అభినందించారు. డీసీసీ అధ్యక్షుల పది రోజుల శిక్షణ శిబిరం విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా ముగింపు కార్యక్రమంలో రాహుల్ గాంధీ "వెల్ డన్ మహేష్" అంటూ కితాబు ఇచ్చారని నాయకులు తెలిపారు. శిబిరం మొదటినుంచీ చివరి

వరకు స్వయంగా పాల్గొని, ప్రతి సెషన్‌ను సమర్థంగా నిర్వహించిన మహేష్ గౌడ్ కృషిని ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ కూడా ప్రశంసించారు.

.....జీఎస్

లోక్ భవన్

ఈ రోజు హోళి సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లోక్ భవన్ ప్రాంగణంలో ఉద్యోగుల పిల్లలు, అధికారులు, సిబ్బందితో కలిసి రంగుల పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరకి హోళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆనందంతో పాటు ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమని గవర్నర్ అన్నారు.

.....డెస్క్

హోళీ వేడుకలు

రాష్ట్రవ్యాప్తంగా ఈ రోజు హోళీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ పోలీస్ కమీషనరేట్ లో కమీషనర్ సంగ్ ప్రీత్ సింగ్ తో పాటు సిబ్బంది రంగులు చల్లుకున్నారు. నల్లగొండ లోని మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయంలో హోళీ వేడుకలు జరుపుకున్నారు. నకిరేకల్ లో జరిగిన హోళీ వేడుకల్లో ఎమ్మెల్యే వీరేశం పాల్గొన్నారు. భువనగిరిలో ఎమ్మేల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హోళీ వేడుకల్లో పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్లా జిల్లావ్యాప్తంగా జరిగిన హోళీ వేడుకల్లో పోలీసు సూపరింటెండెంట్ మహేశ్ బీ గీతే పాల్గొన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన వేడుకల్లో పోలీస్ సూపరింటెండెంట్ నితికా పంత్, ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు. మహబూబా బాద్ జిల్లాలో ఎస్ పి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఉత్సవాల్లో ఎస్ పి శభరీష్ పాల్గొన్నారు. నిర్మల్ లో జరిగిన హోళీ వేడుకల్లో ఎస్ పి జానకీ షర్మిల పాల్గొన్నారు. నల్గొండ ఎస్ పి ఆఫీసులో జరిగిన వేడుకలో పోలీసు సూపరింటెండెంట్

రమేష్ పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లాలోని గిరిజన తండాలోని హోళీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

....వరంగల్, నల్లగొండ, నకిరేకల్, భువనగిరి, రాజన్న సిరిసిల్లా, ఆసిఫాబాద్, మహబూబా బాద్, నిర్మల్, మంచిర్యాల పిటిసిలు

ఆది

హోలీ పండుగ మన సంస్కృతిలో ఐక్యతను ప్రతిబింబిస్తుందని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హోలీ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా అయన మాట్లాడుతూ..

ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు అది శ్రీనివాస్, సౌండ్ బైట్

.....పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

అనసూయ సీతక్క

రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్కను 'టీచ్ ఫర్ ఛేంజ్ ట్రస్టీ' ఫౌండర్ మంచు లక్ష్మి ప్రజాభవన్ లో మర్యాదపూర్యకంగా కలిసారు. ఈ సందర్భంగా తాను స్థాపించిన ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను మంత్రి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్యాబోధన కోసం తమ సంస్థ చేయూత అందిస్తుందని మంచు లక్ష్మి వివరించారు.

.....డెస్క్

కరీంనగర్

కరీంనగర్ జిల్లా మాజీ కలెక్టర్ పమేలా సత్పతికి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జింకల పార్కులో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు,

వివిధ సంఘాల ప్రతినిధులు ఆమెను ఘనంగా సత్కరించారు. రెండున్నరేళ్ల పాటు జిల్లా అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పమేలా సత్పతి కృతజ్ఞతలు తెలుపుతూ భావోద్వేగానికి లోనయ్యారు. తన సొంత ఊరు తర్వాత కరీంనగర్ తనను కన్నతల్లిలా అక్కున చేర్చుకుందని, ఇక్కడి ప్రజల ఆదరణను ఎప్పటికీ మర్చిపోలేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ గౌష్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

.....పీటీసీ – కరీంనగర్

జిల్లాలో ప్రత్యేక వైద్య శిబిరాలు...

ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం సూర్యాపేట జిల్లాలో ఈ రోజు నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.వెంకటరమణ తెలిపారు.. ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించే ఈ ఆరోగ్య శిబిరాలలో పలువురు స్పెషలిస్టులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ఈ శిబిరాలను వృద్ధులు, మహిళలు, పిల్లలు వినియోగించుకోవాలని సూచించారు.

పీటీసీ నల్లగొండ జిల్లా.....